క్లుప్తంగా

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కేఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌, పీజేఆర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజ్‌ కుమార్‌ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కేఎస్‌ఆర్‌ ఫీడర్‌ పరిధిలోని జనప్రియ-9 వ్యాలీ, పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌, మాధవపురి హిల్స్‌, కేఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌, అపర్ణ రోడ్డు, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు పీజేఆర్‌ ఫీడర్‌ పరిధిలోని జనప్రియ-9 వ్యాలీ, మాధవపురి హిల్స్‌, పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌ కాలనీ ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదని తెలిపారు.

శాకంబరిగా ఎదురుగడ్డ మైసమ్మ



రాయదుర్గం: మధురానగర్‌ ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనం ఇచ్చారు. ఆషాఢమాసం ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి 11 రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజెంటేషన్‌లో భాష కీలకం

- మనూ వీసీ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌

రాయదుర్గం: ప్రజెంటేషన్‌లో భాష కీలకపాత్ర పోషిస్తుందని మనూ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ నిర్వహించిన ఒకరోజు జాతీయ సెమినార్‌ కమ్‌ వర్క్‌షాప్‌ ' ది ఆర్ట్‌ ఆఫ్‌ ప్రజెంటేషన్‌'లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాన వ్యక్తిత్వ వికాసానికి, భాషా ప్రసారాన్ని సమర్థవంతంగా ఉపయోగించడంలో కమ్యూనికేషన్‌ నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవని, విజయవంతమైన ప్రదర్శనకు కీలకమన్నారు. స్కూల్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ట్రెనింగ్‌ డీన్‌, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్‌ సిద్దిఖీ మోహ్మద్‌ మహమూద్‌ మాట్లాడారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌ అహ్మద్‌, ప్రొఫెసర్లు ముస్తాక్‌ అహ్మద్‌ పటేల్‌, స్మితారాణే, డాక్టర్‌ తయ్యబానజ్లీ, డాక్టర్‌ పర్వీన్‌కుమార్‌ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌ పరిధి పాత రామచంద్రాపురంలో కార్పొరేటర్‌ పుష్పనగేష్‌ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొద్ది రోజులుగా రోడ్డుపై మురుగు పారుతున్నట్లు పాత రామచంద్రాపురం ప్రజలు తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో డివిజన్‌లో పర్యటించడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సామాజిక సేవలోనే ఆనందం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ఉండే ఆనందం మరెందులో ఉండదని రాష్ట్ర బీఆర్‌ఎస్‌ నాయకుడు నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని నందిగూడెంలో ఎన్‌ఎంఆర్‌ యువసేన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై దర్గా ప్రహరీ నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్‌ యూసుఫ్‌ ఖాన్‌, మహమ్మద్‌ నజీర్‌ ఖాన్‌, మహమ్మద్‌ అజీస్‌ ఖాన్‌, తలారి మధుసూదన్‌లు పాల్గొన్నారు.

తెరపైకి కొల్లూరు ఐటీ హబ్‌

- ఐటీ మంత్రి కేటీఆర్‌ను పంపుతానన్న సీఎం
- ఇక్కడ అవసరమైన ప్రభుత్వ భూములున్నట్లు గుర్తింపు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కొల్లూరు ఐటీ హబ్‌ మరోమారు తెరపైకి వచ్చింది. హైదరాబాద్‌లోని హైటెక్‌ సిటీ తరహాలో మరో ఐటీ హబ్‌ నిర్మించాలని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిర్ణయించింది. ఈ ఐటీ హబ్‌ను రామచంద్రాపురం మండలం కొల్లూరు, ఈదుల నాగులపల్లి, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి కొండకల్‌ శివారులో ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా అనుకున్నారు. అయితే రెండేళ్లుగా ఈ దిశగా చెప్పుకోదగిన చర్యలేవీ తీసుకోలేదు. నిర్ణయం అమలు దిశగా అడుగులు ముందుకు పడలేదు. దీంతో ఐటీహబ్‌ అంశం మరుగున పడింది. తాజాగా పటాన్‌చెరులో గురువారం జరిగిన బహిరంగసభలో కొల్లూరు ఐటీ హబ్‌పై సీఎం కీలక ప్రకటన చేశారు. ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను కొల్లూరుకు పంపి హబ్‌ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో



ఈ కొల్లూరు ఐటీ హబ్‌ అంశం మరోమారు తెరపైకి వచ్చినట్టయ్యింది.

భూముల గుర్తింపు..

ఐటీ హబ్‌ కోసం అవసరమైన భూమి అందుబాటులో ఉన్నట్టు అధికార యంత్రాంగం గుర్తించింది. కొల్లూరుతో పాటు, ఈదులనాగులపల్లి, కొండకల్‌ శివారుల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములున్నాయి. కొన్ని అసైన్డ్‌ భూములు కూడా ఉన్నాయి. మిగులు భూములు కూడా ఎక్కువగానే ఉన్నాయి. 600 ఎకరాల భూములు అందుబాటులో ఉన్నట్టు గుర్తించింది. దీంతో హబ్‌ ఏర్పాటుకు భూసేకరణ విషయంలో పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ..

హైదరాబాద్‌ నగరంలోనే కేంద్రీకృతమైన ఐటీ పరిశ్రమలను రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సిద్దిపేట, నిజామాబాద్‌, కరీంనగర్‌ వంటి నగరాల్లో ఐటీహబ్‌లను నిర్మిస్తోంది. ఇక్కడ ఐటీ పరిశ్రమలను స్థాపించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఐటీ నిపుణులకు స్థానికంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలనేది సర్కారు లక్ష్యం. ఇటీవలే సిద్దిపేట ఐటీ హబ్‌ను ప్రారంభించింది. కొల్లూరు ఐటీ హబ్‌ను పెద్దస్థాయిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సుమారు 600 ఎకరాల్లో ఐటీ పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని భావించింది. ఏరియా డెవలప్‌మెంట్‌ ప్రక్రియను చేపట్టాలని భావించింది. రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ విద్యుత్‌ వ్యవస్థ, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ, నీటి సరఫరా ఇలా అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహాన్ని అందించాలని నిర్ణయించింది. తద్వారా మరిన్ని ఐటీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావించింది.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్‌ : జాతీయ రహదారి ఎన్‌హెచ్‌ 65 రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం బీహెచ్‌ఈఎల్‌ చౌరస్తాలో జరుగుతున్న ఫ్లై ఓవర్‌ నిర్మాణం, రోడ్డు విస్తరణ, వరద నీటి కాలువ పనులను చందానగర్‌ డివిజన్‌ అధ్యక్షులు రఘునాథ్‌ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతుందన్నారు. అప్రోచ్‌ రోడ్డు పునరుద్ధరించాలని, సర్వీస్‌ రోడ్డులో తీసిన గోతుల చుట్టు రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చందానగర్‌



చందానగర్‌లో సర్వీస్‌ రోడ్డు వద్ద గోతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

డివిజన్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, అక్బర్‌ ఖాన్‌, మల్లేష్‌ గుప్తా, గురుచరణ్‌ దుబే, రాజశేఖర్‌ రెడ్డి, నరేందర్‌, యశ్వంత్‌ అమిత్‌, అంజాద్‌, సందీప్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీకి ఘన నివాళులు



మసీదుబండలో శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు



టెలికామ్‌నగర్‌లో..

రాయదుర్గం: ప్రత్యేక సంస్థానంగా ఉన్న జమ్మూకాశ్మీర్‌ వెళ్ళాలంటే నాడు అనుమతి కావాల్సి ఉండేదని, 370 ఆర్టికల్‌ విధానాన్ని వ్యతిరేకించి రద్దు చేయాలని పోరాడిన వ్యక్తి జనసంఘ్‌ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీ అని శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతియాదవ్‌ అన్నారు. బీజేపీ అధ్వర్యంలో కొండాపూర్‌లోని మసీదుబండ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ప్రాణత్యాగం వృధా కాకుండా దేశ ప్రజల అభీష్టం మేరకు ప్రధాని నరేంద్రమోడీ 370 ఆర్టికల్‌ రద్దు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్‌, కంచర్ల ఎల్లేష్‌, ఆంజనేయులు, సాగర్‌ , రమేష్‌, వినోద్‌ రావు, సదానందయాదవ్‌, శ్రీశైలం యాదవ్‌ పాల్గొన్నారు.

టెలికామ్‌నగర్‌లో......

గచ్చిబౌలి డివిజన్‌ టెలికామ్‌నగర్‌లో బీజేపీ జిల్లా నాయకులు డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసంఘ్‌ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్‌ ముఖర్జీకి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశం కోసం చేసిన త్యాగాలను, పోరాటాలను బీజేపీ నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టెలికామ్‌నగర్‌వాసులు దినేష్‌యాదవ్‌, సుభాష్‌, రఘుమారెడ్డి, వెంకటేష్‌ ,స్థానికులు పాల్గొన్నారు.

'టచ్‌ ఎ లైఫ్‌ ఫౌండేషన్‌' సేవలు అభినందనీయం

సాక్షి, సిటీబ్యూరో: బాలికల విద్యను ప్రోత్సహించడంలో విశేషంగా కృషి చేస్తున్న 'టచ్‌ ఎ లైఫ్‌ ఫౌండేషన్‌' వార్షిక కార్యక్రమం 'స్పర్శ'ను టీ-హబ్‌ వేదికగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌ పర్సన్‌ వి.సునీత లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ., బాలికల విద్యతో పాటు వారి ఉన్నత భవిష్యత్తే కోసం 'టచ్‌ ఎ లైఫ్‌ ఫౌండేషన్‌' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విదేశీ విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించే డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ పథకాన్ని తమ సేవల్లో భాగంగా వినియోగించుకునే ప్రయత్నం చేయాలని ఫౌండేషన్‌ నిర్వాహకులకు సూచించారు. సంస్థ వ్యవస్థాపకులు విభూతి జైన్‌, రినా హిందోచా ఫౌండేషన్‌ సమగ్ర ప్రాజెక్ట్‌ రిపోర్టును వివరించారు. ఫౌండేషన్‌ అందించిన నాణ్యమైన విద్య బాలికలకు ఉన్నతమైన భవి



మాట్లాడుతున్న సునీతాలక్ష్మారెడ్డి

ష్యత్‌ను అందిస్తుందన్నారు. భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలను స్థాపించేలా తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగరంలోని టర్కీ కాన్సుల్‌ జనరల్‌ హెచ్‌ఈ ఓర్హాన్‌ యల్మాన్‌ ఓకాన్‌, మైరాన్‌ హోమ్స్‌ చైర్మన్‌ డాక్టర్‌. ఎం. యువరాజ్‌, మహమ్మద్‌ ఖలీగుర్‌ రెహమాన్‌, డాక్టర్‌ శ్రీ రావు, జైపాల్‌, స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఔటర్‌ రింగ్‌రోడ్డుపై వాహనం ఢీ కొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడ రోటరీ వద్ద ఔటర్‌పై శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి(50 నుంచి 55)ని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 9490617127 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గంలో నీటి సమస్యను పరిష్కరించాం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ ప్లాట్‌ నెంబర్‌ 13, శిల్ప ఎవెన్యూ విశ్వంభర మెయిన్‌ గేటు దగ్గర బోర్‌ కాంపౌండ్‌ వాల్‌, ట్రీబోర్డులు ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్ల కాలంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో మంచినీటి సమస్యను పరిష్కరించామన్నారు. దానితో పాటు రోడ్లు డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 90శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, పాతూరి గోపి, రాజేష్‌ రాయ్‌ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్లు జైలు, జరిమానా

గచ్చిబౌలి: సోదరిని హత్య చేయబోయిన కేసులో సోదరుడికి కూకట్‌పల్లి కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని నడిగడ్డతండాకు చెందిన పత్లావత్‌ రవీందర్‌(28), సోదరి సోని, తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్నారు. సోని తన భర్తతో మనస్పర్థల కారణంగా తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ క్రమంలో సోని, సోదరుడు రవీందర్‌ల మధ్య తరచు గొడవలు జరుగుతుండేవి. సోనీని ఎలాగైనా ఇంట్లో నుంచి వెళ్లగొట్టాలని ప్రయత్నించాడు.వీలు కాకపోవడంతో ఆమెను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో 2022 మార్చి 18వ తేదీ మధ్యాహ్నం సోనితో గొడవపడ్డాడు. బయటికి లాక్కొని వచ్చి బండరాయితో చంపడానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నంలో కుడికాలిపైన రాయి పడడంతో గాయపడింది. వెంటనే తల్లిదండ్రులు కొండాపూర్‌ ఆసుపత్రిలో చేర్పించారు. తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం సోని మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ పూర్తయిన తర్వాత కోర్టులో చార్జీషీటును దాఖలు చేయగా కూకట్‌పల్లి కోర్టు సీనియర్‌ సివిల్‌ జడ్జి వి.శ్రీనివాస్‌రావు సాక్షులను విచారించి రవీందర్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్ష, జరిమానాను విధించినట్లు పోలీసులు తెలిపారు.

డబుల్‌ ఇళ్ల జాబితా ప్రకటించాలి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఎన్నికలు సమీపించడంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌ హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పటాన్‌చెరులో జరిగిన ముఖ్యమంత్రి సభ ఎన్నికల సభలా జరిగిందన్నారు. డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు స్థానికులకు ఎంత మందికి కేటాయించారు, లబ్ధిదారుల జాబితా విడుదల చేయాలన్నారు. డబుల్‌ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బలరాం, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పోచయ్యకు బీఆర్‌ఎస్‌ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్‌ : చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని సురక్ష ఎన్‌క్లేవ్‌ కాలనీకి చెందిన బీజేపీ సీనియర్‌ నాయకులు పోచయ్య శుక్రవారం డివిజన్‌ అధ్యక్షులు రఘునాథ్‌ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో చందానగర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్‌, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌, ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీస్‌లా పనిచేస్తే మంచి ఫలితాలు



డీఎస్పీగా పదోన్నతి పొందిన వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పోలీసులు

పటాన్‌చెరుటౌన్‌: ప్రజలకు రక్షణ కల్పిస్తూ..ఫ్రెండ్లీ పోలీసు వాతావారణంలో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఎస్పీగా పదోన్నతి పొందిన వేణుగోపాల్‌ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు క్రైం సీఐ లాలూనాయక్‌, ఎస్‌ఐలు ప్రసాద్‌రావు, రామానాయుడు, క్రైం ఎస్‌ఐ పవన్‌, ఎస్‌ఐ దుర్గయ్య తదితరులు వేణుగోపాల్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడకు వెళ్లినా పటాన్‌చెరు పీఎస్‌ సిబ్బందిని గుర్తుంచుకుంటాన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సురేందర్‌ రెడ్డి, మల్లయ్య, జగదీష్‌, వీవీఎస్‌ఎన్‌ రాజు, రైటర్‌ నరేష్‌, అమర్‌, శ్రీనివాస్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆషాఢ పంచమిని పురస్కరించుకొని శుక్రవారం అన్నపూర్ణాదేవికి అభిషేకం, అర్చన చేశారు. 11 కిలోల పసుపు కొమ్ముల దండ వేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

అభివృద్ధిలో అగ్రగామిగా పటాన్‌చెరు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఆశీస్సులతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముందుగా సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై మంత్రి హరీశ్‌రావుతో చర్చించడం జరిగిందని, హామీలు త్వరగా అమలు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంపై సీఎంకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి రూ.128 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నిధుల మంజూరు సహకరించిన మంత్రులు కేటీఆర్‌, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. అనంతరం సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీలు సుధాకర్‌ రెడ్డి, కుమార్‌గౌడ్‌, మున్సిపల్‌ చైర్మన్‌ తుమ్మల పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు కుమార్‌ యాదవ్‌, పుష్ప నగేష్‌, సీనియర్‌ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ అంజయ్య, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మండల సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు ఎంపీపీ సుష్మశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు సుప్రజ, ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందజేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారి ఎంఈఓ రాథోడ్‌ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, రాగి జావ అందజేస్తారన్నారు. పెద్దకంచెర్ల ప్రభుత్వ పాఠశాలకు నాలుగు అదనపు తరగతి గదులు కావాలని సర్పంచ్‌ సభ దృష్టికి తెచ్చారు. ఇస్నాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత ఉందని ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం విద్యాధికారికి తెలిపారు. అనంతరం గ్రామీణ ఆరోగ్య కేంద్రం అధికారి మాట్లాడారు. ఆర్‌హెచ్‌సీ పరిధిలో 27 వేల మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. తర్వాత విద్యుత్‌ సమస్యలపై సభ్యులు మాట్లాడారు. నందిగామలో విద్యుత్‌ వైర్లు కాలిపోతున్నాయని, విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతోందని సభ దృష్టికి సర్పంచ్‌ తెచ్చింది. ఇస్నాపూర్‌, రుద్రారం గ్రామాల్లో కాలువల డైరెక్షన్‌ మారుస్తున్నారని, ఇరిగేషన్‌ అధికారులు పరిశీలించాలన్నారు. ఇస్నాపూర్‌కు క్యాసారం నుంచి వాటర్‌ పైపులైన్‌ వేయాలని ఎంపీటీసీ శ్రీశైలం కోరారు. చిట్కుల్‌ గ్రామంలోని మల్లన్న దేవస్థానం వద్ద మార్కెట్‌ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కోరారు. అంత్యోదయ లబ్ధిదారులకు మొదటిగా సరుకులు వారికి ఇచ్చే విధంగా చూడాలని సర్పంచ్‌లు కోరారు. బీసీ బంధుకు 600 దరఖాస్తులు వచ్చినట్టు మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్‌ తెలిపారు. గంజాయి నియంత్రణకు ఎక్సైజ్‌ శాఖ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తన దృష్టికి వచ్చిన ఓ గంజాయి కేసును సభలో వివరించారు. ఓ తల్లి తన కొడుకు గంజాయి మత్తులో వచ్చి ఇబ్బందులు పెట్టేవాడని చెప్పుకుందని చెప్పారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బస్‌ షెల్టర్‌ లేక..



ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌లో చెట్టు కింద నిలబడ్డ ప్రయాణికులు



మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌లో ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి కింద ..

హఫీజ్‌పేట్‌ : బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చెట్టు నీడన నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని ఆల్విన్‌ కాలనీ చౌరస్తా మొదలు ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌, న్యూహఫీజ్‌పేట్‌, సీఆర్‌ ఫౌండేషన్‌ బస్టాప్‌ల వద్ద షెడ్లు లేక ప్రయాణికులు రోడ్ల పక్కన నిల్చుంటున్నారు. మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌ బస్టాప్‌ వద్ద ఉన్న ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి కింద ప్రయాణికులు వేచి ఉంటున్నారు. భానుడి తాపాన్ని తట్టుకోలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇక వర్షాకాలం వానకు తడవాల్సిందే. దీనికితోడు బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపడంతో ప్రయాణికులు పరుగెత్తాల్సి వస్తుంది. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు బస్సుల కోసం రోడ్డుపై పరుగు తీస్తున్నారు. ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌, న్యూ హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్‌ ఇరువైపులా, సీఆర్‌ ఫౌండేషన్‌, మదీనాగూడ దీప్తి శ్రీనగర్‌ బస్టాండ్‌ల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



న్యూ హఫీజ్‌పేట్‌ ఆదిత్యనగర్‌ బస్టాప్‌లో..

షెల్టర్లను నిర్మించాలి



ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌ ఇరువైపులా బస్‌ షెల్టర్లను నిర్మించాలి. చెట్ల కింద నిలబడుతున్నాం. ఆర్టీసీ బస్సులు స్టాప్‌లలో ఆపకుండా రోడ్డుపైనే ఆపుతుండడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–రాములు, న్యూ హఫీజ్‌పేట్‌